# అద్దె బ్రతుకు

మీరెప్పుడైనా విశాఖపట్నం వచ్చినప్పుడు కురుపాం మార్కెట్ పక్కనుంచి నడుస్తూ పోతూంటే కుడిచేతివైపు రామ మందిరం కనిపిస్తుంది. దాని పక్క సందువేపు దృష్టి మళ్ళిస్తే (మీరు తిరగక్కర లేదు) ఓ పెంకుటిల్లు కనిపిస్తుంది. అదే – అదే రామనాథంగారి యిల్లు.

రామనాథంగారు ఈ లోకంలోకి వచ్చి ఏభై ఆరు సంవత్సరాలు, తాలూకా ఆఫీసులో గుమాస్తాగా కుదురుకుని ముప్పై అయిదు సంవత్సరాలూ, ఉద్యోగం నుంచి రిటైరయి పది నెలలూ, ఆ యిల్లు కొని ఆరు నెలలూ, అమ్మేసి వారం రోజులు అయింది.

రామనాథంగారు యిల్లు కొంటున్న రోజునే అమ్మేస్తారని నాకు ఎందుకో నమ్మకం కలిగింది. మొహమాటం పడకుండా ఆయనతో ఆ మాట చెప్పాను. కాని వినలేదు. "నీ మొహం! అపశకునం మాటలూ నువ్వూ!" అన్నారు. నాకు అలాంటి నమ్మకం ఎందుకు కలిగిందంటారా? – రామనాథంగారు మంచివారు కనక. ఆయన మంచివాడేనని చిరిగిపోయిన ఆయన పాతకోటూ, కేవలం పసుపుతాడుతో పార్వతీ దేవిలా ఉన్న ముసిలి భార్యా, పెళ్ళయిన పెద్ద కూతురూ, పెళ్ళి అయి ముండ మోసిన రెండో కూతురు, ఇంక పెళ్ళి కాదని రూఢయిపోయి చదువుకొన్న నాలుగో కూతురు, చనిపోయిన ఆయన పెద్దకొడుకు చెప్తారు. నిజాయితీ, నిక్కచ్చితనంతో అతను ఉద్యోగంలో ఎందరికో శత్రువయ్యాడు.

మొదట్నుంచీ – అంటే రామనాథంగారు తల్లి కడుపున పడినప్పట్నుంచీ – ఆయన

అద్దె యింట్లోనే ఉంటున్నారు. అద్దె కొంపలో ఓ తల్లి కడుపున పడి, ఆసుపత్రిలోని అద్దె మంచం మీద పుట్టి, అద్దె కొంపలో పెరిగి, పిల్లల్ని కని వాళ్ళకి పెళ్ళిళ్ళు చేశాడు.

ఏభై ఆరేళ్ళ జీవితంలో – పోయినవీ, చచ్చిపోయినవీ కోరికలు పోగా – మిగిలిపోయింది ఒకటుంది – తనదంటూ చెప్పుకునే యింట్లో కన్ను మూస్తే చాలునని. మంచివాళ్ళకి – ముఖ్యంగా రామనాథంగారి లాంటి వాళ్ళకి – యివి చాలా గడ్డు కోరికలు, సాహసోపేతమయిన కోరికలూను.

రిటైరయాక వచ్చిన నాలుగు రాళ్ళూ పట్టుకుని నా దగ్గరికి సలహాకి వచ్చినప్పుడు– "మీకు యిల్లెందుకు మేష్టారూ! హాయిగా ఏ పాతిక రూపాయిలిచ్చినా మీ రెండు పెద్ద ప్రాణాలు బ్రతికేయవచ్చు" అన్నాను. ఆయన మనస్సు ఆ మాటలకి కలుక్కుమంది. ముసలి కళ్ళలో ఏ మూలో నీళ్ళు కదిలినట్టనిపించింది. ఇక ఆ ఆలోచన మీద వత్తిడి చేయలేదు. ఆ వచ్చిన డబ్బుతో ఓ కొంప కొనుక్కొని అందులో పడిఉండాలని పట్టుబట్టారు రామనాథంగారు. జీవితం యిచ్చిన కష్టాలతోపాటు, యింటి యజమానులు తెచ్చిన నష్టాలను కలబోసుకొని ఆయన ఇన్నాళ్ళకి కాస్త స్వేచ్ఛగా, సుఖంగా బ్రతకాలని ఆ ముసిలి ప్రాణం కలలు కంటోంది.

తంటాలుపడి పడి– యిందాక నేచెప్పిన యిల్లు బేరానిక్కుదుర్చుకున్నారు. ధర ఎంతయితే ఏం? చేతికొచ్చిన డబ్బు దాదాపు అయిపోయింది. మనస్సుకి కావలసినంత తృప్తి మిగిలింది. పూర్ణకుంభం పట్టుకుని ఆ ముదుసలి దంపతులు ఆ పాత యింట్లో గృహప్రవేశం చేస్తుంటే, కూతుళ్ళు దేవుడి పటాలను గోడలకి తగిలిస్తూ సంబరపడుతుంటే నాకు కళ్ళనీళ్ళే వచ్చాయి. భేష్, ముసలాడు యిన్నాళ్ళకి నిజంగానే ఓ మంచి పని చేశాడని సంబరపడ్డాను.

తర్వాత ఓ నెలరోజులపాటు ఆ కుటుంబానికి తీరికలేదు. యింటిముందు ఉన్న కాస్త ఆవరణలో ముసలాయన పార, గునపం పట్టుకుని గొయ్యిలు తవ్వుతుంటే ఆడపిల్లలు అన్నిరకాల పిచ్చిమొక్కలూ తీసేశారు. బంతి చెట్లూ, చేమంతులూ, జాజి, మరువం, దమనం దగ్గర్నుంచి కొతిమీర బచ్చలి వరకూ వేసేశారు. ఇంటిముందు ఆవరణ మూడో తరగతి ప్యాసింజరు రైలు పెట్టెలాగ తయారయింది. వేసిన మొక్కల్లో చాలా బ్రతకలేదుకాని, వేసిన వాళ్ళ ముఖాలు నవనవలాడుతూ వికసించాయి. తనదంటూ చెప్పుకునే పదిగజాల స్థలమంటే మానవుడికి ఎంత మక్కువ!–అనిపించింది.

ఆ యింట్లో అయిదు గదులున్నాయి. వెనకవేపు చిన్న వంటగది. ఒక మూల రేకులు పరిచిన స్నానాల గది. పెద్ద నుయ్యి ఉన్నాయి. మొత్తానికి మరీ పెద్దదికాక పోయినా యిమ్మగా ఉన్న యిల్లే.... స్వేచ్ఛగా ఆ యింట్లో నలుగురూ నాలుగ్గదుల్లో పడుకొన్నా మరోగది మిగిలిపోతుంది–ఇంటిముందు పెద్ద జువ్వి చెట్టు.

నెలరోజులు తిరిగాక ఓ రోజు కూరల బజారులో తటస్థపడ్డారు. రామనాథంగారు చాలా హడావిడి పడుతున్నారు. కూరల బజారులోనే సగం రోజుగడిపేసే ఆయన ఆ రోజు

కాలు నిలపకుండా పరుగులెత్తడం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆపి పలకరిస్తే - రెండు మాటలు చెప్పి, 'వస్తానురా. కొత్త వెరైటీ గులాబి మొక్క బెంగుళూరు నుంచి సంపాదించుకు వచ్చాను. ఎండ వచ్చేలోగా దానికి తడిక అడ్డు కట్టాలి' అని బయలుదేరారు. ఆశ్చర్యపోతూ ఆయన్ని చూశాను. మరి పది సంవత్సరాలు చిన్నవాడిలాగ కనిపించారు. చాలా హాయిగా, హామీ పొందిన జీవితాన్ని గడుపుతున్న వాడిలాగ కనిపించారు.

వెళ్తున్నవాడల్లా ఒక్క క్షణం ఆగి "అంత యిల్లు మాకు మరీ ఎక్కువయి పోయిందిరా. ఒక భాగం ఎవరికయినా అద్దెకివ్వాలని అనుకుంటున్నాను" అన్నారు. నేను దిమ్మెరపోయాను.

'మేష్టారూ! అద్దె యింటి యజమానుల బారినుంచి తప్పించుకోవడానికి మీరు యిల్లు కొన్నారు. ఇప్పుడు మీరు యింటి యజమాని కావాలనుకొంటున్నారా? ఎందుకా బాధ?' అన్నారు.

"నీకు తెలీదురా—పెన్షన్ డబ్బులు అయిపోయాయి. రోజు గడవాలంటే—కొంచెమైనా చేతిలో పైకం ఉండాలికదా—నేను అద్దెకి యిచ్చేది అవసరం కొద్దీ కాని—లాభాలకి కాదు" అన్నారు.

ఉద్దేశం మంచిదే. ఆయన చెప్పిన కారణమూ మంచిదే. కాదనలేక పోయాను.

ఒక రోజు యింటికి వెళ్ళాను. అద్దెకివ్వదలచిన భాగానికి అన్ని సౌకర్యాలు అప్పుడే చేసి ఉంచారు రామనాథంగారు. వెనక తడికల్తో చిన్న బాత్‌రూం ఏర్పాటు చేశారు. ముందు వేపు వసారాలో చిన్నభాగం అద్దెవాళ్ళకి నేరుగా అమర్చారు. అంతేకాదు. ముందు వేసిన పూలమొక్కలో అద్దెవాళ్ళ భాగంలో పువ్వులన్నీ వాళ్ళే ఉపయోగించుకోవచ్చునని చెప్పారు. ఆ లెక్కన ఓ సన్నజాజి పందిరి, మరువం, డిసెంబరు పువ్వులూ అద్దెవాళ్ళ వాటాకి వచ్చాయి. ఇంత సుఖాన్ని ఏ యజమాని అమరుస్తాడు? వీధిలో కొళాయి, పక్కనే బజారు, అన్నీ ఉన్నాయి. రెండు గదులు, వంటిల్లూ, బాత్‌రూంకీ ఆ ప్రాంతలో కనీసం 'ఎనభై చెప్పండి' అన్నాను.

అంతే. మాష్టారికి చర్రున కోపం వచ్చింది.

'నేనేం వడ్డీ వ్యాపారస్తుడిననుకొన్నావా? - దగుల్బాజీననుకున్నావా?'

అర్థంకాక తెల్లబోయాను.

'ఈ యింటితో వ్యాపారం చేసి—వేలు గడించి మేడలు కట్టాలని కాదు బాబూ. ఎవరయినా చిన్న సంసారం ఉన్నవాళ్ళకి 40కి యిస్తానంతే ఒక్క పైసా ఎక్కువైనా పుచ్చుకోను' అన్నారు ఖరాఖండిగా.

'కాని యింటికి సులువుగా ఎనభై వస్తుంది' అన్నాను.

"అద్దెవాళ్ళు డబ్బు యిచ్చుకోడానికి పడే బాధ నాకు తెలుసు. వీళ్ళని కష్టపెట్టి నేనేం బాగుపడతాను' అన్నారు.

'కాని ఈమాత్రం యింటికి—కష్టపడకుండానే సులువుగానే యిస్తారు' అని నచ్చచెప్పబోయాను.

కాని మేష్టారు వినలేదు. 40 ఏళ్ళ అద్దె జీవితం అతని మనస్సుమీద భయంకరమైన ముద్ర వేసింది. ఆ పీడకల ఎంత దారుణమయినదో ఆయనకి తెలుసు. దాన్ని మరొకరి జీవితంలో– కనీసం తన ద్వారా ప్రవేశపెట్టడం రామనాథంగారికి యిష్టం లేదని గ్రహించాను. పైపెచ్చు ఆయన మంచివాడు. మంచివాడి సదుద్దేశాన్ని, దుర్మార్గుడి దురుద్దేశాన్ని మార్చడం కష్టం.

ఆ యింట్లో తెల్లవారేసరికి ఎవరో ఒకరు దిగిపోతారన్న నమ్మకం కలిగింది. చెప్పొద్దూ! నాకే అక్కడ ఉండాలని మనస్సు పీకింది. అలాంటి యిల్లు ఎవడు కాదంటాడు? అదిన్నీ అటువంటి మంచివాడి పంచన?

కాని ఆశ్చర్యమేమిటంటే–రెండు నెలలు గడిచినా ఎవరూ ఆ యింట్లో దిగడానికి యిష్టపడలేదు. ఎంతోమంది వచ్చి చూసి పోతున్నారట. ఈ విషయం తెలిసి నేను నివ్వెరపోయాను.

అచిరకాలంలో ఆ ఇంటి గురించి – ఆ ఇంటి యజమాని గురించి పదిరకాలుగా చెప్పుకోవడం విన్నాను.

మేష్టారినడిగితే కొన్ని అంశాలు తెలిశాయి. వచ్చిన వాళ్ళకి అన్నీ నచ్చుతున్నాయట. అద్దె దగ్గరికి వచ్చేసరికి ఆశ్చర్యపోతున్నారట–సాధారణంగా జరుగుతున్న సంభాషణ యిది.

'అద్దెంత సార్?'

'నలభై'

'ఏమిటీ ఉత్త నలభైయ్యా?'

అక్కడినుంచీ వరసగా ప్రశ్నలు–'ఇంతకు ముందు ఎవరుండేవారు?'

'వాళ్ళెందుకు ఖాళీ చేశారు?'

'అసలు ఈ యిల్లు అమ్మకానికి ఎందుకొచ్చింది?'

'నలభైయేనా? నేను సరిగా వినలేదా?' యిలాంటి ప్రశ్నలు చాలామంది నుంచి వచ్చాయి.

అద్దె తక్కువ కావడం అందరిలో ఆశ్చర్యాన్ని మాత్రమే కలిగిస్తే విచారం లేదు. కాని రకరకాల అనుమానాలనీ, ఆలోచనల్నీ రేకెత్తించింది. ఇంట్లో ఏదో లొసుగు లేకపోతే అంతమంచి యింటికి నలభైయ్యే అద్దె ఎందుకివ్వాలి? – అని ప్రతివాడి అనుమానం. ఆ యింటి గురించి రకరకాల విషయాలు అద్దెవాళ్ళు చెప్పుకోవడం విన్నాను.

అసలు ఆ యిల్లు సమాధుల మీద కట్టారట – అది అచ్చిరాని యిల్లట – అక్కడ ఉంటున్న ఒక యిల్లాలు ముందుగదిలో ఉరిపోసుకు చచ్చిందట – ఆయింటి చెట్టుమీద దెయ్యం ఉందట – అది అసలు దెయ్యాల కొంపేనట! యిలా చెప్పుకుంటున్నారు!

అంతవరకూ అయితే ఫరవాలేదు – 'అతని కూతుళ్ళకి పెళ్ళి కాలేదు. ఆ విషయం తెలుసా! అదీ అసలు కారణం!' అని కొందరు అనుకొని ముసిముసినవ్వులు నవ్వుకొన్నారు.మూడో అమ్మాయికి పెళ్ళి కాకుండా ఉండిపోవడానికి, ఈ యింటికి కూడా

ఏదో సంబంధం ఉందని కూడా అన్నారు కొందరు వ్యక్తులు. 'ముసలాడు మెత్తగా కనిపిస్తాడు కాని ఇంట్లోకి రానిచ్చి - కోర్టులకి ఈడ్చి ఏడిపించే రకం - లేకపోతే అంత ఇల్లు ఎలా కొనగలిగాడంటారు?' అని మాటలు లేవదీసి తృప్తి పడ్డారు. వాటిని మాష్టారు ఎలా భరించారో తెలీదు. కాని ఆయన్ని మొదట్నుంచీ తెలిసిన నాకు ఆ మాటలు విన్నాక మనస్సు కలచి వేసి నట్టయింది. అయినా ఇప్పుడిక చెయ్యగలిగిందేమీ లేదు. ఈ వాటా ఖరీదు 40 రూపాయలే!

ఇంటికోసం వెదికేవాళ్ళు 'బజారు పక్క సందులో 40 రూపాయల ఇల్లు చూశారా?' అని నవ్వుకోవడం విన్నాను. ఎవరేనా ఇల్లు కావాలంటే 'బజారు సందులో 40 రూపాయల ఇంటికి మాత్రం పోకండేం?' అనడం విన్నాను.

'అమ్మో-ఆ విషయం ముందే హెచ్చరించారులెండి మిత్రులు' అని చిరునవ్వుతో జవాబు రావడమూ గ్రహించాను.

ఆ ఇల్లు ప్రజలకు ఒక జోక్ అయిపోయింది. ఎవరేనా తక్కువ అద్దెకు ఇల్లు సంపాదిస్తే-'రామనాథంగారి ఇల్లు లాంటిదేనా బాబూ!' అని నవ్వుకోవడం విన్నాను.

తర్వాత ఓ రోజు ఉదయం మేష్టారుగారు పనికట్టుకొని మా ఇంటికి వచ్చారు. ఆయన్ని చూసి నిర్ఘాంతపోయాను. మరో పదేళ్ళు ముసిలివాడయి పోయినట్లు కనిపించారు.

"మేష్టారూ!" అన్నాను.

"చాలా పెద్ద ఇబ్బందిలో పడిపోయాన్రా బాబూ, నువ్వే నన్ను రక్షించాలి" అని నా రెండు చేతులూ పట్టుకున్నారు.

ఏమిటని అడగలేదు - అదివినడానికి, చెప్పడానికీ చాలా బాధాకరమయిన విషయం అని తెలిసి.

"ఇల్లు అమ్మించి పెట్టాలి. ఎంత త్వరగా అమ్మేస్తే అంత సుఖపడతాను" అన్నారు ఆయన. ఆ క్షణంలో ఆయన ముఖంలో బాధ చూసి కళ్ళనీళ్ళు వచ్చాయి.

"ఇప్పుడిక ఆ ఇల్లు అమ్మడం ఎంత కష్టమో నాకు తెలుసు. అయినా ఆ విషయం ఆయనకు వివరించలేదు. 'అలగే చూద్దాం' అనేశాను.

అన్నంత సులువుగా విషయం పరిష్కారం కాలేదు.

కాని రెండు నెలలపాటు నానా యిబ్బందులూ పడి, బ్రోకర్‌కి ఇవ్వవలసిన దానికంటే ఎక్కువ కమీషన్ ఇచ్చి ఎవరో పైవూరు పార్టీకి అమ్మకం చేసేశాం. మాష్టారిగారు ఇల్లు ఖాళీ చేస్తున్నప్పుడు నేనూ దగ్గర ఉన్నాను.

ఇంటిని వదిలించుకుంటున్నందుకు ఆయనకు మనస్సులో ఎక్కడో తృప్తి ఉన్నదేమో తెలీదు కాని, ఆ కోరికను ఇంత క్రూరంగా త్రుంచి వేస్తున్నందుకు ఆయన ముఖంలో దుఃఖం గుర్తు పట్టగలిగాను. పిల్లలు తాము స్వయంగా వేసి పెంచిన పూల మొక్కల్ని దిగులుగా చూస్తూ గుమ్మం దాటారు.

మాష్టారుకి ఆ వయస్సులో-ముఖ్యంగా ఆయన నమ్మకాల మీద-తగలవలసిన దెబ్బ కాదది అతనికి. పూర్తిగా నలిగిపోయారాయన. మనిషి బాగా కృంగిపోయారు.

పాత ఉత్సాహం కూడా ఆయనలో పోయింది.

ఈ బాధాకులిత ప్రపంచంలో మేష్టారు రూపంలో ఎదురయిన మంచితనాన్ని ఎవరూ నమ్మలేక పోయారు. మంచితనానికి ఫేస్‌వేల్యూ చెడింది. ఆఖరికి మేష్టారి వ్యక్తిత్వం మీద, శీలం మీద ఆ ప్రభావం పడింది. ఆయన జీవితమూ శిథిలమయింది.

ఒక చిన్న ఇల్లు ముప్ఫై రూపాయలకి అద్దెకు కుదుర్చుకుని ఆయన దిగారు. మళ్ళీ అద్దె జీవితం ప్రారంభమయింది. ఆ బెడద వదిలిపోయింది కనక న్యాయంగా కాస్త హాయిగా ఊపిరి పీల్చుకుని, పీడకలని మరిచిపోయి అద్దె కొంపలో విశ్రాంతి తీసుకోవలసిన పరిస్థితి అది.

అయితే మేష్టారు విశ్రాంతి తీసుకొన్నారు. మరి కొద్దిరోజుల్లోనే అద్దె కొంపలో ఆయన శాశ్వతంగా విశ్రాంతి తీసుకున్నారు.

-----